క్లుప్తంగా

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి

ముని్సపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: చెత్త సేకరణపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, అవి రాకుండా ఉద్యోగులు చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 14వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అక్కడక్కడ వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, శానిటరి ఇన్‌స్పెక్టర్ అనుపమ, తదితరులు ఉన్నారు.

ప్రణయ్ హత్య కేసులో కోర్టు తీర్పుపై హర్షం

తెనాలి: కులాంతర ప్రేమవివాహం చేసుకున్న మిర్యాలగూడ పట్టణ దళిత యువకుడు ప్రణయ్‌ను హత్యచేసిన కేసులో బిహార్ రాష్ట్రానికి చెందిన కిరాయి హంతకుడు శుభాష్‌కుమార్ శర్మకు నల్గొండ జిల్లా 2వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మరణ శిక్ష విధించడంపై తెనాలికి చెందిన రాష్ట్ర దళిత నాయకుడు, న్యాయవాది కేసీ బసవయ్య సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ప్రణయ్ హత్య కేసులో మొత్తం 8 మంది నిందితులు కాగా, 2వ ముద్దాయి అయిన శుభాష్‌కుమార్ శర్మకు మరణశిక్ష, 3, 4, 5, 6, 7, 8 ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష విధించటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. వీరితోపాటు గిరిజన నాయకులు గరిక వెంకటదుర్గారావు, రత్నమ్మ కూడా హర్షం వ్యక్తంచేసినవారిలో ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



తెనాలిఅర్బన్: మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామని కాల్వలు నిర్మించేలా చూడాలని 1వ వార్డుకు చెందిన కొందరు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అక్రమణలు తొలగించాలని కొందరు, ఇంటి పన్నులో లోపాలు ఉన్నాయని సరిచేయాలని ఒకరు, టిడ్కో నివాసాల వద్ద వాటర్ పైప్‌ల లీక్‌లకు మరమ్మతులు చేయాలని మరొకరు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు అర్జీలు ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి సేవలు చిరస్మరణీయం



కొల్లిపర: భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రీబాయిపూలే చిరస్మరణీయ సేవలు అందించారని విశ్రాంత ఉపాధ్యాయుడు బండి ప్రభుదాస్ చెప్పారు. సోమవారం కొల్లిపరలోని రెగ్యులర్ పాఠశాల, పిడపర్తిపాలెంలో ఉర్దూపాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. విద్యార్థులకు సావిత్రీబాయి జీవిత చరిత్ర వివరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ వై.భవాని, ప్రధానోపాధ్యాయుడు పి.మృత్యుంజయరావ్ , పి.రమేష్ బాబు, కరీమూన్, సుమని, సురేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పీజీ సెట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి



మంగళగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉమ్మడి పీజీ సెట్ నోటిఫికేషన్, పరీక్షను రద్దు చేయాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ డిమాండ్ చేసింది. మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద సోమవారం ఏపీ స్టూడెంట్స్ జేసీ, వివిధ యూనివర్శిటీ అధ్యక్షులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఉన్న స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తూ ఆయా యూనివర్శిటీలు పీజీ సెట్‌లు నిర్వహించేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. అనంతరం హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ మధుమూర్తిని కలసి వినతిపత్రం అందజేశారు. జేఏసీ ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్తార్ బాషా, కిషోర్, ఎస్కే యూనివర్శిటీ అధ్యక్షులు అమర్ పాల్గొన్నారు.

యువత పోరును జయప్రదం చేద్దాం

- ఫీజు బకాయిలు తక్షణం విడుదల చేయాలి
- పేదలకు విద్య, వైద్యాన్ని దూరం చేస్తున్న కూటమి సర్కారు
- నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన ఎక్కడ?
- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



యువత పోరు పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని విద్యార్థులు, యువజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు తెలియజేసే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న 'యువత పోరు'కు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే, తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ కోరారు. విద్యార్థులు, యువజనులు, తల్లిదండ్రులు హాజరై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పార్టీ నాయకులు, విద్యార్థి నాయకులతో కలిసి 'యువత పోరు' పోస్టరును శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులకు నాలుగు త్రైమాసికాలుగా బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ద్వారా ఇవ్వాల్సిన రూ.3,900 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవటంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఇబ్బంది పెడుతున్నాయని శివకుమార్ చెప్పారు. కొందరిని కాలేజి నుంచి కూడా పంపించి వేస్తున్నట్టు తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవటంతో విద్యార్థులు విద్యాసంవత్సరం మధ్యలోనే చదువు ఆపేసి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన నిరుద్యోగ భృతి చెల్లించలేదని గుర్తుచేశారు. చదువుకున్న యువజనులకు ఉద్యోగాల కల్పన ఎండమావిలా తయారైందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఎంతగానో అభివృద్ధి చేశారని చెప్పారు. విద్యార్థులు, యువజనుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు వినతిపత్రాన్ని ఇచ్చేందుకు యువత పోరు కార్యక్రమాన్ని పార్టీ చేపట్టిందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో విద్యార్థి నాయకులు నిట్టా బాలు, పాముల అనుదీప్, పల్లె రోహిత్, ఉమర్ మొఘల్, ఇర్ఫాన్, కోలా వాసు, కాళిదాసు సత్యం, ప్రసాదం సురేష్, కుర్రా జస్వంత్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు షేక్ దుబాయ్‌బాబు, కఠారి హరీష్, కుర్రా శ్రీను, అక్కిదాసు కిరణ్, చుక్కా ఆనంద్, చుండూరు వెంకటేశ్వరరావు, దేశబోయిన పుణేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం వెంకటేష్



ప్లకార్డులతో ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటుతున్నా.. ఇప్పటి వరకు విద్యార్థులను పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. వారి సమస్యలు పరిష్కరించాలని అనేక పోరాటాలు చేస్తున్నా సర్కారు స్పందించకపోవడం బాధాకరమన్నారు. యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని నేటి రాష్ట్ర విద్యాశాఖమంత్రి లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఆయన ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. జీవో నంబరు 77 ను రద్దు చేస్తామనే హామీ ఇచ్చి అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. సంక్షేమ వసతిగృహాల్లో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు గండు శివ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించడం వలన అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అనంతరం ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. సమావేశంలో నాయకులు రవి, అఖిల్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు



నిందితుల వద్ద లభించిన బ్యాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తెనాలి మండలం కఠెవరానికి చెందిన నీలకంఠం కృష్ణమూర్తి అలియాస్ కృష్ణ, కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన అతని పెదనాన్న కొడుకు నీలకంఠం ప్రభుకుమార్ అలియాస్ ప్రభు ఇద్దరూ గంజాయికి అలవాటు పడ్డారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి చెందిన మల్లవరపు పృధ్వి వీరికి గంజాయి విక్రయిస్తూ ఉండేవాడు. గంజాయి అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని పృధ్వి వీరికి చెప్పడంతో అతని వద్ద 1.50 కిలోల గంజాయి కొనుగోలు చేసి తెనాలి తీసుకువచ్చి చిన్న పొట్లాలుగా చేసి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. మున్సిపల్ కార్యాలయం పక్కన కాలువ కట్ట రోడ్డులోని ఆటో స్టాండ్ వద్ద సోమవారం విక్రయించేందుకు సిద్ధంగా ఉండగా సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ కె.రాములనాయక్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి వీరిని మధ్యవర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు సమాచారం ఇచ్చి ఆయన సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేసిన సీఐ, సిబ్బందిని డీఎస్పీ బి. జనార్ధనరావు అభినందించారు.

వైభవంగా శాంతి కల్యాణం



స్వామి శాంతి కల్యాణం జరుగుతున్న దృశ్యం



హాజరైన భక్తులు

తెనాలి: నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోవర్ధన స్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం స్వామి శాంతి కళ్యాణం వైభవంగా జరిగింది. భక్తుల సహకారంతో స్వామి ముఖమండప పునర్నిర్మాణం పూర్తిచేసిన సందర్భంగా నాలుగురోజులుగా ఆలయంలో జీవధ్వజ శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేక ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆదివారం జీవధ్వజ శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం భక్తుల సమక్షంలో స్వామి శాంతి కల్యాణాన్ని జరిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్‌వీఎస్ మల్లేశ్వరి పర్యవేక్షణలో ఆలయ వంశపారంపర్య అర్చకులు టి.రఘు, వేదాంత మాధవభట్టాచార్యులు కార్యక్రమాలను జరిపించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల కుటుంబసభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, ఆత్రేయ, కేశవ, నరసింహభట్టాచార్యులు, యశ్వంత్, అనంతచార్యులు, రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ గ్రీవెన్స్‌కు 11 అర్జీలు

తెనాలి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు మొత్తం 11 అర్జీలు వచ్చాయి. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ డివిజనులోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషిచేస్తానని హామీ నిచ్చారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఆరుగురు అర్జీలనివ్వగా, మున్సిపాలిటీ పరిధిలోని మూడు, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖలకు చెందిన ఒక్కోటి ఉన్నాయని తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవాలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలో శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నాల్గవ రోజు సోమవారం కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. దేవాలయంలో సుప్రభాత సేవ, నవనీత హారతి, నిత్య కైంకర్యాలు, నవ కుంభారాధన, నరసింహ హోమం, సాయంత్రం నిత్య హోమం, గరుడోత్సవం, ఆలయ బలిహారణ జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు సాకేత్ శర్మ, రామచంద్రలు పర్యవేక్షించారు.

హ్యాకింగ్‌పై ఓటీటీ చిత్ర నిర్మాణం



సమావేశంలో మా ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్‌రాజా

తెనాలిటౌన్: ప్రపంచాన్ని వణికిస్తున్న హ్యాకింగ్ మోసాలపై తెనాలి పట్టణానికి చెందిన నూతన దర్శకులు దోనే నరేష్, మణి వరుణ్ ఓటీటీ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మా ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా తెలిపారు. సోమవారం మా ఏపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర వివరాలను వెల్లడించారు. దేశ వ్యాప్తంగా సైబర్ క్రైమ్ పోలీసులకు సవాలుగా మారినందున ఈ నూతన కథాంశాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మళయాళ భాషల్లో అందించనున్నట్టు వివరించారు. అనుపమ ఆర్ట్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రానికి నిర్మాతగా రావూరి సురేష్‌బాబు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. యువ దర్శకులు ఇద్దరు కోటప్పకొండ ఓటీటీ చిత్రంతో పరిచయమైనట్లు గుర్తు చేశారు. సమావేశంలో కాస్ట్యూమ్ డిజైనర్ పట్నాల పార్వతి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళలపై ఆసక్తి పెంచుకోండి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కృష్ణ, శ్రీనివాస్

తెనాలిఅర్బన్: కళల పట్ల కొందరికి ఆసక్తి ఉంటుందని, అలాంటి వారిని ప్రోత్సాహించాల్సిన అవసరం విద్యాసంస్థలపై ఉందని ప్రముఖ హార్మోనిస్ట్ బి.కృష్ణ, డ్యాన్స్ మాస్టర్ జె.శ్రీనివాసులు పేర్కొన్నారు. జేఎంజే మహిళా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోపాటు ఆసక్తి ఉన్న రంగంలో రాణించాలని సూచించారు. అనంతరం ఫోక్ డ్యాన్స్, స్టోరి టెల్లింగ్, సోలో సాంగ్స్ వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా విజ్ఞాన్ యూనివర్శిటీ అధ్యాపకులు డాక్టర్ ఎం.విమలాదేవి, కె.అరుణోదయ వ్యవహరించారు. గుంటూరులోని జేకేసీ కాలేజ్, ఏసీ కాలేజ్, హిందూ కాలేజ్, టీజేపీఎస్ కాలేజ్, తెనాలిలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల, వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల, గుప్తా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల కమిటీ కన్వీనర్ డాక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మేరి శారద, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

డంపు..కంపు



గ్రామంలో సేకరించిన చెత్తను దహనం చేసిన దృశ్యం



ఇష్టారాజ్యంగా పడవేసిన చెత్త చెదారాన్ని పాడుచేస్తున్న శునకాలు

తెనాలిటౌన్: ఆర్భాటం ఘనం.. అభివృద్ధి శూన్యం అన్నట్లుగా కూటమి ప్రభుత్వం చర్యలు ఉన్నాయని నందివెలుగు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఇళ్ల నుండి సేకరించిన చెత్త చెదారం పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్‌లు ద్వారా తీసుకువెళ్ళి జనావాసాల మధ్య కనకదుర్గమ్మ గుడి సమీపంలోని ఖాళీ స్థలంలో డంపింగ్ చేస్తున్నారు. చెత్తను తగలబెడుతున్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధం భరించలేక, పొగ వల్ల శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఆ సమీపంలోని 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం సిబ్బంది సైతం దీనివల్ల ఇబ్బంది పడుతున్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా మారడం వల్లే ఈ దుస్థితి తలెత్తింది. స్థానికులు ఎన్నిసార్లు ఈ సమస్యపై విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు. డంప్ చేసిన చెత్తచెదారంపై కుక్కలు కలియ తిరుగుతూ ఆ ప్రాంతాన్ని మరింత దుర్భరంగా మారుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను జనావాసాలు లేని ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనారాయణ కల్యాణం



శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తెనాలి: స్థానిక కొత్తపేటలోని తాలూకా హైస్కూల్ మైదానంలోని ప్రత్యేక వేదికపై జరుగుతున్న అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈనెల 14 వరకు నిర్వహించే ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా సోమవారం గోపూజతో కార్యక్రమాలను ఆరంభించారు. శ్రీలక్ష్మీనారాయణ కల్యాణాన్ని భక్తుల సమక్షంలో నేత్రపర్వంగా జరిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు రామానుజదాసి పసుమర్తి పద్మజాకుమారి శ్రీరాముడి గుణగణాలను వివరించారు. బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తి తన ప్రవచనంలో పంచముఖ ఆంజనేయస్వామి సద్గుణాలను వివరించారు. వైఖానస పండితులు నారాయణ గోవర్ధన్ లక్ష్మీ రఘురాం, వేదాంతం నాగ మారుతి, రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్.వి.కిరణ్, సురేష్ బృందం వేదాగమ పూజలు చేశారు. సాయంత్రం విద్యార్థులు ఉచిత సామూహిక శ్రీసరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ములుకుట్ల విశ్వనాథ శర్మ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భగవద్ రామానుజ దాసుడు జంధ్యం రామారావు దంపతులు భక్తి పూర్వక సహకారం అందించారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ జరిగాయి. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవాసమితి, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి అనురాధ, వెంకటేశ్వరరావు ,గుడివాడ బాల కృష్ణ , మదుపల్లి చంద్రశేఖర్, మాజేటి వెంకటేష్, గోలి సోమశేఖర్ పర్యవేక్షించారు.



గోపూజ చేస్తున్న భక్తులు



వేదిక వద్ద అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ ప్రతులు



ఉచిత సామూహిక సరస్వతీదేవి పూజలో చిన్నారులు

అనుమతి లేకుండా ఇసుక తరలింపు

దుగ్గిరాల: దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామంలో సోమవారం చెరువు గట్టుకు పోసిన ఇసుకను అనుమతి లేకుండా అక్రమంగా తవ్వుతున్నట్లు గ్రామ సర్పంచ్ గంపల గంగాధరరావు తెలిపారు. గంగాధరరావు మాట్లాడుతూ 1.80 సెంట్లు గల స్మశాన స్థలంలో గతంలో 2021 నవంబర్ 19న ఉన్నటువంటి అక్రమ షాపులను తొలగించి, చదును చేసి గ్రామాభివృద్ధి కొరకు ఉపయోగించాలని తీర్మాణం జరిగిందన్నారు. ఇప్పుడు అదే స్థానంలో మళ్లీ యథావిధిగా షాపులు నిర్మించారని, పక్కనే ఉన్న చెరువు చుట్టూ ఇసుకపోసి వాకింగ్ ట్రాక్ వేసి ఆధునీకరణ చేయాలని పంచాయతీ తీర్మాణం చేసిందన్నారు. ప్రభుత్వ అండదండలతో వాకింగ్ ట్రాక్‌కు వేసినటువంటి ఇసుక, మట్టిని అనుమతి లేకుండా కొందరూ నేతలు పొక్లెయిన్‌తో తరలిస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో చిర్రావూరు గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మంగళగిరి అధికారిణి సులోచన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోనే అభ్యర్థులు జులై 2024 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయస్సు గలవారై ఉండాలన్నారు. అభ్యర్థినులు స్థానిక వివాహితురాలై ఉండాలని, 7వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి అనితెలిపారు. బయోడేటా, వయస్సు, కుల, విద్యార్హత, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు.. ఒంటి మహిళల అయితే 18 సంవత్సరాలోపు పిల్లలు ఉన్నవారు వయస్సు, భర్త మరణ ధృవీకరణ పత్రం, ఆధార్ నకళ్లకు గెజిటెడ్ అధికారి సంతకంతో దరఖాస్తులు సమర్పించాలని వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు శిశు అభివృద్ధి పథకపు అధికారి, మంగళగిరిలోని భగత్ సింగ్ నగర్‌లోని సమగ్ర శిశు అభివృద్ధి పథకం కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

పొట్టి శ్రీరాములు స్మృతి సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడి నియామకం

తెనాలిరూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి గుంటూరు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అలపాటి శివనరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు సమితి జాతీయ అధ్యక్షుడు జి.వేణుపోపాల్ నుంచి నియామక పత్రాన్ని సోమవారం అందుకున్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు పొట్టి శంకర్ నారాయణ, కోశాధికారి ఎ. బాలగణేష్ జిల్లా ఉపాధ్యక్షుడు కాకుమాను సీతారామయ్య, తెనాలి పట్టణ ఉపాధ్యక్షుడు అనుపోతుల పూర్ణ చంద్రరావు, అప్పావరపు శివ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దుకాణాల్లో తనిఖీలు



మంగళగిరి టౌన్ : ఎంటీఎంసీ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల నియంత్రణ చర్యల్లో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ అధికారులు పలు షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ అలీమ్‌బాషా ఆదేశాల మేరకు నగర పరిధిలో దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని, జరిమానాలు విధించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 390 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నామని, సుమారు రూ.35 వేల వరకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, భారీ జరిమానాతో పాటు షాపులను కూడా సీజ్ చేస్తామని షాపుల యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ శానిటరీ సెక్రటరీలు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.